RNI NO. TELTEL2010/34557
www.deshatimes.in

# దేశ టైమ్స్ DESHA TIMES

తెలుగు దిన పత్రిక
నిజం.. నిర్భయం.. నిరంతరం

దేశ టైమ్స్
DESHA TIMES
16 సంవత్సరాలుగా వెలువడుతున్న "దేశ టైమ్స్" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాలు, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..
సెల్ నెంబర్: 9849758280

నల్గొండ | సెప్టెంబర్ 3 గురువారం 2026 | సంపుటి : 16 | సంచిక : 210 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాషా
NALGONDA | THURSDAY SEPTEMBER 3 2026 | VOL:16 | ISSUE: 210 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన..
# రాజ్‌నాథ్‌సింగ్, రామ్మోహన్‌నాయుడితో భేటీ

### ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 సమ్మిట్ కు రాజ్‌నాథ్ ను ఆహ్వానించిన రేవంత్

### డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని విన్నపం

### రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణపై రామ్మోహన్ తో చర్చించిన సీఎం

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో వరుసగా భేటీ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి పలు కీలక అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చలు జరిపారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'కు రాజ్ నాథ్ సింగ్ ను ముఖ్య అతిథిగా సీఎం ఆహ్వానించారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌లో భాగమైన డిఫెన్స్ ఎక్స్‌పోలో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భాగస్వామ్యం వహించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర వద్ద ప్రతిపాదించిన డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు ఉచితంగా భూమి కేటాయించాలని కోరారు. ఇక ఆదిలాబాద్ విమానాశ్రయం పునరుద్ధరణ అంశాన్ని రాజ్‌నాథ్ దృష్టికి తీసుకెళుతూ.. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే 750 ఎకరాల భూసేకరణ పూర్తి చేశామని, అవసరమైతే మరో 750 ఎకరాలు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.అనంతరం పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో సమావేశమైన రేవంత్ రెడ్డి... రాష్ట్రంలోని విమానాశ్రయాల విస్తరణ, అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా ఆదిలాబాద్, వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయాల పనులను వేగవంతం చేయాలని, కొత్త విమానాశ్రయాల ప్రతిపాదనలకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట మంత్రి గడ్డం వివేక్, ఎంపీలు మల్లు రవి, బలరామ్ నాయక్, అనిల్ కుమార్ యాదవ్ తదితర నేతలు ఈ భేటీలలో పాల్గొన్నారు.



## నాపై కాదు.. ముందు రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోండి: ఢిల్లీలో కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు!



### ఢిల్లీలో పార్టీ అధిష్ఠానాన్ని కలిసిన కొండా సురేఖ

### పార్టీలో బీసీ నేతలను టార్గెట్ చేస్తున్నారని విమర్శ

### అధిష్ఠానం తనను రాజీనామా చేయాలని కోరలేదని వెల్లడి

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ మంత్రి కొండా సురేఖ... సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈరోజు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆమె... తనపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పార్టీ పెద్దలను డిమాండ్ చేశారు.తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేస్తూ చర్యలు తీసుకోవాలనుకోవడం సరికాదని సురేఖ స్పష్టం చేశారు. మహిళలు స్వతంత్రంగా జీవించాలని రాహుల్ గాంధీ ఎప్పుడూ చెబుతుంటారని అన్నారు. తన కుమార్తెను తీవ్రంగా రెచ్చగొట్టడం వల్లే ఆమె ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని

(మిగతా 2వ పేజీలో..)

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాధించిన ప్రగతి ఇదే: కవిత

### ప్రజా వ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన సాగిందన్న కవిత

### హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని మండిపాటు

### రాబోయే రోజుల్లో తెలంగాణలో మళ్లీ ప్రజల ప్రభుత్వమే వస్తుందని వ్యాఖ్య

(మిగతా 2వ పేజీలో..)




## టీజీఎస్ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టుల భర్తీ: మంత్రి పొన్నం ప్రభాకర్

### 1000 రోజుల పాలనలో టీజీఎస్ఆర్టీసీ సాధించిన ప్రగతిని వివరించిన ప్రభుత్వం

### మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.12,167 కోట్ల ఆర్థిక ప్రయోజనం

### సంస్థలోకి 2,932 కొత్త బస్సులు.. ఎలక్ట్రిక్ వాహనాలకు పెద్దపీట

### ఉద్యోగులకు రెండు పీఆర్సీలు, ఐదు డీఏలు.. 4,538 పోస్టుల భర్తీకి చర్యలు

### ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేసిన మంత్రి పొన్నం



తెలంగాణలో ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయిన సందర్భంగా రవాణా శాఖ, టీజీఎస్ఆర్టీసీ సాధించిన ప్రగతిని ప్రభుత్వం వెల్లడించింది. ప్రజా రవాణాను బలోపేతం చేయడంతో పాటు మహిళలు, ప్రయాణికులు, కార్మికులకు మేలు చేసేలా అనేక సంస్కరణలు చేపట్టామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సంస్థను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వం

(మిగతా 2వ పేజీలో..)

## "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే".. కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్

### కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల

### కాంగ్రెస్ అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ విమర్శ

### రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయలేదన్న కేటీఆర్

### కాళేశ్వరం విషయంలో రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.

(మిగతా 2వ పేజీలో..)



## 7.8 శాతం వృద్ధి.. అయినా మోదీ 'బంగారం కొనొద్దంటున్నారేంటి? అసలు లెక్క ఇదే!

### బంగారం కొనొద్దని మోదీ మరోసారి పిలుపు

### విదేశాల్లో పెళ్లిళ్లకూ దూరంగా ఉండాలని విజ్ఞప్తి

### బంగారం దిగుమతులతో భారీగా విదేశీ మారకం ఖర్చు

### చమురు ధరల పెరుగుదలతో మరింత ఒత్తిడి

### జూన్ త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు

దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధితో దూసుకెళుతోంది. అయినా ప్రధాని నరేంద్ర మోదీ మాత్రం ప్రజలకు ఓ కీలక విజ్ఞప్తి చేశారు. అవసరం లేకపోతే బంగారం కొనొద్దు.. సరదా కోసం విదేశాలకు వెళ్లొద్దు.. విదేశాల్లో పెళ్లిళ్లు చేసుకోవద్దు అని సూచించారు. దేశం బలంగా ఉన్న సమయంలోనే ఇలాంటి జాగ్రత్తలు ఎందుకు చెబుతున్నారు? దీని వెనుక పెద్ద ఆర్థిక లెక్కే ఉంది.

బంగారంపై ఎందుకంత దృష్టి?

భారత్ తన బంగారం అవసరాల్లో దాదాపు మొత్తం దిగుమతులపైనే ఆధారపడుతోంది. అంటే మనం బంగారం కొన్న ప్రతిసారీ దేశం నుంచి విదేశీ మారకం బయటకు వెళ్తుంది. దిగుమతులు పెరిగితే వాణిజ్య లోటు పెరిగే అవకాశం ఉంటుంది.

(మిగతా 2వ పేజీలో..)





## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం.. ఆర్థిక లోటు ఉన్నా సంక్షేమం ఆపలేదు: పొంగులేటి

### వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### సామాన్యుల కష్టాలు తీర్చేందుకు నిరంతరం కృషి చేశామన్న పొంగులేటి

### రైతు సంక్షేమానికి రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని వెల్లడి

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... తమ ప్రజా



(మిగతా 2వ పేజీలో..)

RNI NO. TELTEL2010/34557 తెలుగు దినపత్రిక

దేశ టైమ్స్

సత్యం కోసం .... సమాజం కోసం

## సంపాదకీయం

# విమానాశ్రయాల అభివృద్ధితో తెలంగాణకు కొత్త రెక్కలు

మామునూరు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులు పూర్తయితే ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం

తెలంగాణ అభివృద్ధిలో రహదారులు, రైల్వేలు, పారిశ్రామిక కారిడార్లతో పాటు విమానయాన మౌలిక వసతులు కూడా కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో ఇప్పటికే హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాన విమానయాన కేంద్రంగా కొనసాగుతున్నప్పటికీ, ఇతర ప్రాంతాలకు విమాన సౌకర్యాలు విస్తరించాల్సిన అవసరం చాలాకాలంగా ఉంది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ ప్రాంతాలకు మెరుగైన విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వస్తే ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జరిపిన సమావేశంలో ఈ రెండు విమానాశ్రయాల పనులను వేగవంతం చేయాలని కోరడం ద్వారా ప్రభుత్వం ఈ అంశానికి ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది.

మామునూరుపై పెరుగుతున్న ఆశలు

వరంగల్ నగరానికి సమీపంలోని మామునూరు విమానాశ్రయం అభివృద్ధి ఎన్నో ఏళ్లుగా చర్చలో ఉన్న అంశం. వరంగల్ కేవలం ఒక నగరం మాత్రమే కాదు.. విద్య, వైద్యం, పర్యాటకం, వ్యవసాయం, చిన్నతరహా పరిశ్రమలు, వాణిజ్య కార్యకలాపాలకు ముఖ్య కేంద్రంగా ఎదుగుతున్న ప్రాంతం. ఇలాంటి ప్రాంతానికి విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వస్తే దాని ప్రభావం నగరానికే పరిమితం కాకుండా చుట్టుపక్కల జిల్లాలపైనా పడే అవకాశం ఉంటుంది.మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణను పూర్తి చేసి ఇచ్చామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి వివరించారు. ఇక మిగిలింది పనులను కార్యరూపంలోకి తీసుకురావడమే. రెండు వారాల్లో టెండర్లు పిలిచి, డిసెంబర్ నాటికి ప్రక్రియను పూర్తి చేసి అదే నెలలో పనులకు శంకుస్థాపన చేస్తామని కేంద్ర మంత్రి వెల్లడించడం ఈ ప్రాజెక్టుపై ఆశలు పెంచుతోంది.అయితే ప్రకటనలతో పాటు నిర్ణయించిన గడువుల్లో పనులు ముందుకు సాగడమే అసలు పరీక్ష. టెండర్లు, నిర్మాణం, సాంకేతిక అనుమతులు, భద్రతా ప్రమాణాలు వంటి అన్ని దశలను సమన్వయంతో పూర్తి చేసినప్పుడే మామునూరు విమానాశ్రయం ప్రజలకు అందుబాటులోకి వస్తుంది.

ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్టు.. పారిశ్రామిక అవకాశాలకు బాట

ఆదిలాబాద్ విమానాశ్రయానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఉత్తర తెలంగాణలోని ఈ ప్రాంతానికి విమాన కనెక్టివిటీ పెరిగితే వాణిజ్య కార్యకలాపాలు, పెట్టుబడులు, పర్యాటకం, రవాణా రంగాలకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. ముఖ్యంగా కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్‌వో వంటి సదుపాయాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి చేసిన ప్రతిపాదనలు విమానాశ్రయాన్ని కేవలం ప్రయాణికుల రాకపోకలకు పరిమితం చేయకుండా విస్తృత ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా తీర్చిదిద్దాలనే ఆలోచనను సూచిస్తున్నాయి.ఎంఆర్‌వో సదుపాయాలు ఏర్పడితే విమానాల నిర్వహణ, మరమ్మతులు, సాంకేతిక సేవలకు సంబంధించిన కార్యకలాపాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. తద్వారా నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరిగే వీలుంది. కార్గో సదుపాయాలు అందుబాటులోకి వస్తే వ్యవసాయ ఉత్పత్తులు, ఇతర సరుకులను వేగంగా మార్కెట్లకు తరలించేందుకు ఉపయోగపడవచ్చు.

పర్యాటకానికి హెలీ టూరిజం

తెలంగాణలో పర్యాటక రంగానికి కూడా విమానయాన మౌలిక వసతులు కొత్త ఊపునివ్వగలవు. చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, ప్రకృతి అందాలు, జలాశయాలు, అటవీ ప్రాంతాలు రాష్ట్రంలో అనేకం ఉన్నాయి. వీటిని మెరుగైన రవాణా సౌకర్యాలతో అనుసంధానం చేస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో హెలీ టూరిజం అభివృద్ధి ప్రతిపాదన కూడా ఆసక్తికరమైన అంశమే. సాధారణ రవాణా మార్గాలతో పాటు హెలికాప్టర్ సేవలను పర్యాటక ప్రాంతాలకు అనుసంధానం చేయడం ద్వారా కొత్త తరహా పర్యాటక అవకాశాలను సృష్టించవచ్చు. అయితే ఈ రంగంలో భద్రత, ధరలు, మౌలిక వసతులు, పర్యావరణ ప్రభావం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది.

హుస్సేన్‌సాగర్‌లో సీ ప్లేన్.. మరో కొత్త ఆలోచన

హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు చెప్పడం మరో కొత్త ఆలోచనకు తెరతీస్తోంది. సీ ప్లేన్ సేవలు ఆచరణలోకి వస్తే నగర పర్యాటక రంగానికి కొత్త ఆకర్షణగా మారే అవకాశం ఉంది. అయితే దీనికి సంబంధించి సాంకేతిక, భద్రతా, పర్యావరణ, నీటి వనరుల పరిరక్షణ అంశాలను నిపుణుల సూచనలతో సమగ్రంగా పరిశీలించాలి.

మాటలకంటే కార్యాచరణ ముఖ్యం

విమానాశ్రయాల అభివృద్ధి విషయంలో ప్రభుత్వాల మధ్య సమన్వయం అత్యంత కీలకం. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ, స్థానిక మౌలిక వసతులు, పరిపాలనా అనుమతుల విషయంలో తన బాధ్యతలను పూర్తి చేయాలి. కేంద్ర ప్రభుత్వం తన పరిధిలోని అనుమతులు, సాంకేతిక అంశాలు, నిధులు, విమానయాన సంస్థలతో సమన్వయం వంటి అంశాలను వేగవంతం చేయాలి.ప్రాజెక్టులు ప్రకటించడం కంటే అవి నిర్ణీత కాలపరిమితిలో పూర్తవడమే ప్రజలకు నిజమైన ప్రయోజనం. వరంగల్, ఆదిలాబాద్ ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న విమాన సౌకర్యం ఇక ఫైళ్లలోనే కాకుండా వాస్తవ రూపంలో కనిపించాలి. అభివృద్ధి చెందిన విమానాశ్రయం ఒక రన్‌వే, టెర్మినల్ భవనం మాత్రమే కాదు.. అది ఒక ప్రాంతానికి పెట్టుబడులను, ఉపాధిని, పర్యాటకాన్ని, వాణిజ్యాన్ని తీసుకువచ్చే అభివృద్ధి వేదిక.తెలంగాణలో సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సాధించాలంటే హైదరాబాద్ చుట్టూ మాత్రమే మౌలిక వసతులు కేంద్రీకృతం కాకుండా జిల్లాల స్థాయిలోనూ రవాణా వ్యవస్థలను బలోపేతం చేయాలి. మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాలు ఆ దిశగా కీలక అడుగులుగా నిలవాలి. ప్రకటనల నుంచి పనుల దిశగా.. ప్రణాళికల నుంచి ప్రజల వినియోగంలోకి.. విమానాశ్రయాల అభివృద్ధి వేగంగా సాగితేనే తెలంగాణ అభివృద్ధికి నిజమైన కొత్త రెక్కలు వస్తాయి.

# 7.8 శాతం వృద్ధి.. అయినా మోదీ 'బంగారం కొనొద్దంటున్నారేంటి? అసలు లెక్క ఇదే!

**మొదటి పేజీ తరువాయి)**

డాలర్లకు డిమాండ్ పెరిగితే రూపాయిపై కూడా ఒత్తిడి పడుతుంది.ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభమైన ఆర్థిక సంవత్సరంలో తొలి నాలుగు నెలల్లో బంగారం దిగుమతులు గత ఏడాదితో పోలిస్తే 32 శాతానికి పైగా పెరిగాయి. జులైలో భారత్ వస్తువుల వాణిజ్య లోటు దాదాపు 32 బిలియన్ డాలర్లకు చేరింది. జనవరి తర్వాత ఇదే అత్యధిక స్థాయి.

చమురు మంటకు బంగారం తోడైతే?

భారత్ తన ముడి చమురు అవసరాల్లో 88 శాతానికి పైగా దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు, హర్మూజ్ జలసంధి వద్ద అంతరాయాల భయాలు చమురు మార్కెట్లను కలవరపెడుతున్నాయి.చమురు ధరలు పెరిగితే భారత్‌కు మరిన్ని డాలర్లు అవసరమవుతాయి. అదే సమయంలో బంగారం దిగుమతులు కూడా పెరిగితే విదేశీ మారకంపై ఒత్తిడి మరింత ఎక్కువవుతుంది. అందుకే అవసరం లేని దిగుమతుల్ని తగ్గించాలన్నది మోదీ సూచనలోని ప్రధాన ఉద్దేశం.

విదేశాలకు వెళ్లొద్దన్నది ఎందుకు?

విదేశీ పర్యటన అంటే విమాన టికెట్లు, హోటళ్లు, ఆహారం, స్థానిక రవాణా వంటి వాటిపై విదేశాల్లో ఖర్చు చేయడం. ఇక డెస్టినేషన్ వెడ్డింగ్ అయితే ఖర్చు మరింత భారీగా ఉంటుంది. అందుకే మోదీ అన్ని విదేశీ ప్రయాణాలను ఆపాలని చెప్పలేదు. అత్యవసరం కాని పర్యటనలు, విదేశీ పెళ్లిళ్లను మాత్రం మరోసారి ఆలోచించండి అన్నదే ఆయన సందేశం. ఆ డబ్బును దేశంలోనే ఖర్చు చేస్తే స్థానిక వ్యాపారాలు, సేవలకు ప్రయోజనం కలుగుతుందన్నది స్వదేశీ ఆలోచన.

గతంలోనూ ఇదే మాట

మేలో అమెరికా-ఇరాన్ ఘర్షణల ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలోనూ మోదీ ఇదే తరహా పిలుపునిచ్చారు. ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను వాయిదా వేయాలని, అవసరం లేని విదేశీ ప్రయాణాలను తగ్గించాలని కోరారు. పెట్రోల్, డీజిల్ ఆదా చేయడం, ప్రజా రవాణా ఉపయోగించడం, కార్‌పూలింగ్ చేయడం వంటి సూచనలు కూడా చేశారు.

7.8 శాతం వృద్ధి ఉన్నా ఎందుకీ జాగ్రత్త?

జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి నమోదు చేసింది. ఇది అంచనాల కంటే మెరుగైన ఫలితమే. అయితే మార్చి త్రైమాసికంలోని 8.6 శాతంతో పోలిస్తే వృద్ధి తగ్గింది.ప్రపంచ యుద్ధాలు, చమురు ధరలు, ద్రవ్యోల్బణం, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాల వంటి ముప్పులు ఇంకా ఉన్నాయి. అందుకే ప్రస్తుతం ఉన్న ఆర్థిక బలాన్ని భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

బంగారం ధరలూ మరో కారణమే!

ప్రపంచ అనిశ్చితి కారణంగా బంగారానికి డిమాండ్ పెరుగుతోంది. ఆగస్టులో అంతర్జాతీయంగా బంగారం ధర దాదాపు 10 శాతం పెరిగింది.ధర పెరిగిన సమయంలో భారతీయుల నుంచి డిమాండ్ కూడా బలంగా ఉంటే బంగారం దిగుమతి బిల్లు మరింత పెరుగుతుంది. అందుకే మోదీ పిలుపు వెనుక కేవలం 'బంగారం కొనొద్దు' అనే మాట మాత్రమే లేదు. విదేశీ మారకాన్ని కాపాడటం, రూపాయిపై ఒత్తిడి తగ్గించడం, ప్రపంచ ఆర్థిక షాక్‌ల ప్రభావాన్ని తగ్గించడం, దేశీయ వ్యాపారాలను బలోపేతం చేయడం వంటి నాలుగు కీలక లక్ష్యాలు ఉన్నాయి.

# "ఎటు చూసినా విధ్వంసం, వికృతమే".. కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై కేటీఆర్ ఫైర్

**మొదటి పేజీ తరువాయి)**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ఎటు చూసినా విధ్వంసం, వికృతం కనిపిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఇది వెయ్యి రోజుల పాలన కాదని.. 'పీడన' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ శతాబ్దపు అతిపెద్ద మోసంగా అభివర్ణించారు. పేదల భూములను నిషేధిత జాబితాలో పెట్టి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధి పనులు పెద్దగా చేయకుండానే రాష్ట్ర ప్రభుత్వం రూ.4.50 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు.రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.20 వేల కోట్లు మాత్రమే చేశారని కేటీఆర్ అన్నారు. రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టారని గుర్తుచేశారు. మాఫీ పూర్తిగా చేయకుండా 70 శాతం మంది రైతులను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తెలంగాణను అన్నపూర్ణగా మార్చారని.. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని నాశనం చేసిందని విమర్శించారు.కాంగ్రెస్ పాలనలో ఢిల్లీకి మూటలు మోయడం, పదవుల కోసం కొట్లాడుకోవడం తప్ప మరేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని నిలిపివేసి రాహుల్ బంధుకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగితే కాంగ్రెస్‌ను వదిలిపెట్టబోమని హెచ్చరించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలు, లియోనెల్ మెస్సీ కార్యక్రమాలకు భారీగా నిధులు ఖర్చు చేసిన ప్రభుత్వం, రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మాత్రం డబ్బులు ఖర్చు చేయడం లేదని విమర్శించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్ పేరుతో జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీతో కలిసి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తెలంగాణలో నిరుద్యోగులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాధించిన ప్రగతి ఇదే: కవిత

**మొదటి పేజీ తరువాయి)**

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ వెయ్యి రోజుల కాలం పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు, నెరవేర్చని హామీలతోనే సాగిందని ఆమె ధ్వజమెత్తారు.గడిచిన వెయ్యి రోజుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల బతుకులను బాగు చేసింది ఏమీ లేదని, కేవలం కొందరి సొంత ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చిందని మండిపడ్డారు. హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడం, సంక్షేమ గురుకులాల్లో భద్రత లేక విద్యార్థులు వరుసగా మరణించడం, జాబ్ నోటిఫికేషన్లు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం, పంటలకు మద్దతు ధర లేక అన్నదాతల బలవన్మరణాలు పెరిగిపోవడం.. వీటికి తోడు రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి నేరాలు నిత్యకృత్యం కావడమే ఈ ప్రభుత్వం సాధించిన అసలైన 'ప్రగతి' అని ఎద్దేవా చేశారు. ఉద్యమకారుల నెత్తురు చిందిన నాటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ఈ సర్కార్ కాలం చెల్లిపోయిందని హెచ్చరించారు. ప్రభుత్వ అరాచకాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని, ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో మళ్లీ ప్రజల ప్రభుత్వమే అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా రంజకం.. ఆర్థిక లోటు ఉన్నా సంక్షేమం ఆపలేదు: పొంగులేటి

**మొదటి పేజీ తరువాయి)**

పాలనలో సామాన్యుల కష్టాలను తీర్చడానికే నిరంతరం కృషి చేశామని అన్నారు. రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, గత ప్రభుత్వ అప్పుల భారం ఉన్నప్పటికీ, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరే' అన్నారని, కానీ తమ ప్రభుత్వం రాగానే వరి సాగుకు మద్దతుగా రూ.500 బోనస్ అందిస్తూ, వరి ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపామని గుర్తుచేశారు. రైతు సంక్షేమానికై ఇప్పటికే రూ.1.76 లక్షల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 ప్రశ్నాపత్రాలను అమ్ముకున్నారని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ.8.21 లక్షల కోట్లకు పైగా అప్పులు, నిలిచిపోయిన బకాయిలు, సర్పంచ్‌ల బకాయిలతో పాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులను కూడా తమ ప్రభుత్వమే చెల్లిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పేదలకు రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలోనే మరో 3 లక్షల మందికి కొత్తగా వితంతు, వృద్ధాప్య పింఛన్లు అందజేయబోతున్నామని ప్రకటించారు.కేటీఆర్ హద్దులు మీరి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సంస్కారహీనంగా మాట్లాడితే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ధరణి పేరుతో కొల్లగొట్టిన భూములు, ఆస్తులపై విచారణ జరుగుతోందని, 22ఏ భూములపై అసెంబ్లీలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. నిజమైన ప్రతిపక్ష హోదాకు కేసీఆర్ పూర్తిగా అనర్హుడని విమర్శించారు.



## టీజీఎస్ఆర్టీసీలో 1500 కండక్టర్ పోస్టుల భర్తీ: మంత్రి పొన్నం ప్రభాకర్

**మొదటి పేజీ తరువాయి)**

ఏర్పడిన 48 గంటల్లోనే 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని మంత్రి గుర్తుచేశారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా 347.36 కోట్ల మంది మహిళలు ప్రయాణించారని, తద్వారా వారు రూ.12,167 కోట్ల ప్రయాణ ఖర్చును ఆదా చేసుకున్నారని వివరించారు. మహాలక్ష్మి పథకం ప్రారంభమయ్యాక ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ రేటు 67శాతం నుంచి 89శాతానికి పెరిగిందని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా 600 బస్సులకు మహిళలనే యజమానులుగా చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా టీజీఎస్ఆర్టీసీలో భారీగా కొత్త బస్సులను ప్రవేశపెడుతున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. ఇప్పటివరకు 2,932 కొత్త బస్సులను కొనుగోలు చేయగా, అందులో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పటికే రోడ్డెక్కాయని చెప్పారు. హైదరాబాద్ నగరంలో మరో 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు.ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగులకు రెండు పీఆర్సీలు, ఐదు డీఏలు అమలు చేశామని, ప్రస్తుతం ఒక్క డీఏ కూడా పెండింగ్‌లో లేదని స్పష్టం చేశారు. 1,424 కారుణ్య నియామకాలు చేపట్టడంతో పాటు, గతంలో సర్వీసు నుంచి తొలగించిన 244 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నామని తెలిపారు. 4,538 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా, 1,000 డ్రైవర్, 743 శ్రామిక పోస్టుల నియామక ప్రక్రియ పూర్తయిందని, త్వరలో మరో 1500 కండక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు.సంస్థ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని, సీసీఎస్, పీఎఫ్ బకాయిలను గణనీయంగా తగ్గించామని మంత్రి వివరించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి, ఆర్టీసీ విలీన ప్రక్రియను యూనియన్ ఎన్నికల అనంతరం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

## నాపై కాదు.. ముందు రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోండి: ఢిల్లీలో కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు!

**మొదటి పేజీ తరువాయి)**

చెప్పారు. పార్టీలో బీసీలకు ఒక న్యాయం... రెడ్డి సామాజిక వర్గాలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలు ఎంతోమంది అనుచిత వ్యాఖ్యలు చేసినా చర్యలు తీసుకోలేదని, కేవలం బీసీలనే టార్గెట్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. పదేళ్లు తానే సీఎంగా ఉంటానని రేవంత్‌రెడ్డి సొంతంగా చెప్పుకోవడం ఎంతవరకు సమంజసం? అని సురేఖ ప్రశ్నించారు. రాష్ట్ర కేబినెట్‌లోని పలువురు మంత్రులపై అనేక ఆరోపణలు ఉన్నాయని.. రేవంత్ పాలనపై మంత్రులు, సీనియర్ నేతల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు తనను రాజీనామా చేయమని అధిష్ఠానం కోరలేదని, జరిగిన పరిణామాలన్నింటినీ రాతపూర్వకంగా హైకమాండ్‌కు నివేదించినట్లు తెలిపారు.



RNI NO . TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం
సెప్టెంబర్ । గురువారం । 3 । 2026




# డాక్టర్ ధరం సోతు సీతారాం నాయక్ పి ఐ సి సి ఐ జిల్లా సమన్వయకర్తగా అరుదైన అవకాశం

**ఉమ్మడి వరంగల్ ఏడు జిల్లాల ఇన్చార్జిగా అదనపు బాధ్యతలు**

**దేశ టైమ్స్మహబూబాబాద్ ఆగష్టు 03:**

గిరిజన పారిశ్రామికవేత్తలు ఎం ఎస్ ఎం ఈ లు, యువత మహిళా పరిశ్రమగావేత్తలు మరియు స్వయం ఉపాధి రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్న ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పి ఐ సి సి ఐ) తెలంగాణ చాప్టర్లో డాక్టర్ ధరం సూట్ సీతారాం నాయక్ ను మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్తగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏడు జిల్లాలకు ఇన్చార్జిగా నియమించినట్లు పిఐసిసిఐ తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ ధారావత్ శ్రీనివాస్ తెలిపారు... అధికారికంగా బాధ్యతలు అప్పజెప్తున్నామని, అన్నారు వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఏడు జిల్లాల్లో గిరిజన పారిశ్రామికవేత్తలు ఎం ఎస్ ఎం ఈ లు మహిళా పరిశ్రమల వేత్తలు యువత మరియు కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే ఔత్సాహికులను ప్రోత్సహించడం వారికి అవసరమైన అవగాహన మార్గదర్శకత్వం మరియు వ్యాపార అవకాశాలతో అనుసంధానం చేయడం తన బాధ్యతల్లో భాగంగా ఉంటుందని సీతారాం తెలిపారు తెలిపారు సెప్టెంబర్ 4న నేషనల్ ఎస్సీ ఎస్టీ అబ్బు భారత ప్రభుత్వం సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ టీఐసీసీఐ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తల అవగాహన కార్యక్రమం 2026 సెప్టెంబర్4న హనుమకొండ నయీమ్ నగర్ లోని హోటల్ అరోమా లో ఉదయం 9:30 సాయంత్రం 4:00 వరకు పరశురామ్ కి వ్యక్తుల అవగాహన మరియు ప్రత్యేక వెండల అభివృద్ధి కార్యక్రమం నిర్వహించబోతున్నామని తెలియజేశారు..ఈ కార్యక్రమంలో ఎం ఎస్ ఎం ఈ పథకాలు మరియు ప్రభుత్వ రాయితీలు, వ్యాపార అభివృద్ధి మరియు విస్తరణ బ్యాంకు రుణాలు మరియు ఆర్థిక అవకాశాలు వేదిక ద్వారా ప్రభుత్వ కొనుగోలు ప్రభుత్వ రంగ సంస్థలకు వెండర్ గా మారే అవకాశాలు సాంకేతిక మార్గదర్శకత్వం శిక్షణ మరియు మెంటరింగ్ అంటే అంశాలపై అవగాహన కల్పించనున్నారు..మహబూబాబాద్ జిల్లా నుంచి ఆసక్తి ఉన్న పారిశ్రామికవేత్తలు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకొని కార్యక్రమంలో పాల్గొనాలని, పి ఐ సి సి ఐ మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్త మరి ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇన్చార్జ్ డాక్టర్ ధరం సోప్ సీతారాం నాయక్ కోరారు.. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు



# పెండింగ్ లో ఉన్న పౌతీ విలాసత్ లను వెంటనే పరిష్కరించాలి: సిర్పంగి స్వామి

**వలిగొండ, సెప్టెంబర్ 02 (దేశ టైమ్స్):**

పెండింగ్ లో ఉన్న భూములు పౌతీ విలాసత్ వారసత్వ భూ బదలాయింపులను వెంటనే పరిష్కారం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ పల్లవి రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ కారణాలతో చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు వారసత్వంగా రావలసిన భూ బదలాయింపులు అనేకం పెండింగ్ లో ఉన్నాయని, వీటివల్ల చనిపోయిన వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, మండలంలో వెంటనే వారసత్వ భూ బదలాయింపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఈ భూ బదలాయింపుల దరఖాస్తులో మొదటి పేజీలో కులము మరియు జెండర్, వయసు, పేరు లాంటి వాటి చేర్పులు మార్పులకు జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని వెంటనే స్థానిక మండల స్థాయి అధికారులకు చేర్పులు, మార్పులు చేసే అవకాశాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరోవైపు మండలంలో 22 (ఏ) కింద అనేక గ్రామాల్లో పిఓపి కింద ఎలాంటి కారణాలు లేకుండా నమోదైన భూములను వెంటనే వాటి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. మండలంలో త్రిబుల్ ఆర్, గౌరెల్లి, భద్రాచలం, (ప్రాణహిత చేవెళ్ల) కాళేశ్వరం లాంటి రోడ్లు మరియు కాలువల నిర్మాణంలో ఒకే సర్వే నెంబర్ సుమారు 50 ఎకరాల వరకు పిఓపి లోకి పెట్టడం వల్ల ఆ భూములకు చెందిన రైతులు సుమారు 10 సంవత్సరాలుగా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సర్వే



నెంబర్ ఆధారంగా కాలువ మరియు రోడ్డు నిర్మాణంలో కోల్పోయే భూములకు మాత్రమే వర్తించే విధంగా సరిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు కొండూరు సత్తయ్య, చేగూరి నగేష్, కర్ణకంటి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి





**వలిగొండ, సెప్టెంబర్ 02 (దేశ టైమ్స్):**

గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆవాస గ్రామం మల్లెపల్లి లో 40 లక్షల నిధులతో నిర్మించిన డ్రైనేజి, 10 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును, 10 లక్షల నిధులతో నిర్మించనున్న మహిళా శక్తి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం వెంకట పాపి రెడ్డి, మార్కెట్ చైర్మన్ భీమా నాయక్, పిఏసిఎస్ చైర్మన్ గరిసె రవి, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు బత్తిని సహదేవ్, పోలేపాక జానకి రాములు, ఉప సర్పంచ్ మలుగ మాధవి వెంకటేష్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ జంగారెడ్డి, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## అంతోటి గోపాళ్లు మృతికి పలువురి సంతాపం

**పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 02 (దేశ టైమ్స్):**



బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ అంతోటి తిరుపతిరావు తండ్రి అంతోటి గోపాళ్లు మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు బుధవారం ఉదయం గోపాళ్లు నివాసానికి చేరుకుని పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.బోనకల్ మండల మాజీ జెడ్పీటీసీ బానోతు కొండ, బీఆర్ఎస్ నాయకులు గుండపనేని సుధాకర్‌రావు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం నాయకులు తెల్లాకుల శ్రీనివాసరావు, ఉప్పర శ్రీను, బీఆర్ఎస్ నాయకులు తేళ్లూరి రమేష్, అంతోటి శ్రీను, నారపోగు విజయ్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాయకులు గోపాళ్లు మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం అంతోటి తిరుపతిరావు, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గోపాళ్లు మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు కలగాలని ఆకాంక్షించారు.

## గంధం వంశీ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

- **గార్లపాడు ప్రభుత్వ పాఠశాలలో సేవా కార్యక్రమానికి శ్రీకారం**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 02 (దేశ టైమ్స్):**



గంధం వంశీ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గార్లపాడు మండల ప్రజా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు గంధం ఆనంద్, గంధం పుల్లయ్య ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గంధం ఆనంద్ మాట్లాడుతూ.. గార్లపాడు ప్రభుత్వ పాఠశాల కోసం గతంలో వంశీ అన్న ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో గతంలో పాఠశాల ప్రారంభం కాలేదని, ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాఠశాల తిరిగి ప్రారంభమైందని తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వంశీ మెమోరియల్ ట్రస్ట్ తరఫున నోట్‌బుక్స్ అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు.వంశీ ఆశయాలు, ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ట్రస్ట్ ముందుకు సాగుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని, వంశీ గతంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ పేదలు, విద్యార్థులకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్ దారెల్లి అరుణ, గార్లపాడు అంబేద్కర్ యూత్ సభ్యులు కనకపూడి కళ్యాణ్, కోటి, ఏసురాజు, రఘు, రాకేష్, కమల్ రాజ్, విష్ణు, చరణ్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణ బుధవారం.. లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

**రుద్రంగి సెప్టెంబర్ 2 (దేశ టైమ్స్)**



శ్రావణమాసం బుధవారం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయాన్ని పూలు, మామిడి తోరణాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి తెలిపారు. అనంతరం సర్పంచ్ గండి నారాయణ, మాజీ ఆలయ చైర్మన్ కొమిరె శంకర్ మాట్లాడుతూ.. శ్రావణమాసంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని బియ్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. రుద్రంగి ఇలవేల్పుగా కొలువైన స్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో పాటు పాడిపంటలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఈర్ణం నవీన వార్డు సభ్యులు పూదరి మహిపాల్ భక్తులు పాల్గొన్నారు.

## రైతు, పేదల గుండెల్లో వైఎస్సార్.. రుద్రంగిలో ఘన నివాళులు

**రుద్రంగి సెప్టెంబర్ 2 (దేశ టైమ్స్)**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎర్రం గంగానర్సయ్య ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎర్రం గంగానర్సయ్య మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్సార్ రైతులు, పేదలు, సామాన్య ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసి వైఎస్సార్ అడుగుజాడల్లో నడుస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ మెచ్చిన నాయకుడు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అని, ఆయన కృషితో రైతుల కోసం సురమ్మ ప్రాజెక్టు మంజూరైందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, సర్పంచ్ గండి నారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండి సదుల్లా, వార్డు సభ్యులు ఎర్రం అరవింద్, పుట్కపు మహిపాల్, నాయకులు గడ్డం శ్రీనివాస్, తర్రె లింగం, కేసిరెడ్డి నర్సారెడ్డి, కట్కూరి దాసు, అక్కినపెల్లి శ్రీనివాస్, దయ్యాల రమేష్, పల్లికొండ వినయ్, శివరాత్రి రత్నం తదితరులు పాల్గొన్నారు.



RNI NO. TELTEL2010/34557
తెలుగు దినపత్రిక
దేశటైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

# మరిపెడ మండల నూతన అధ్యక్షుడిగా అనంతగిరి వెంకన్న ఎన్నిక.

## డీలర్ల సమస్యలపై సమష్టి పోరాటానికి హామీ

**దేశటైమ్స్మహబూబాబాద్/మరిపెడ, సెప్టెంబర్ 1:**

మరిపెడ మండల రేషన్ డీలర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక బుధవారం ఉత్సాహంగా జరిగింది. మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాముల వారి దేవస్థానంలో మండలంలోని రేషన్ డీలర్లంతా సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన అనంతగిరి వెంకన్న ఎన్నికయ్యారు.మండల రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. డీలర్లంతా కలిసి నూతన కమిటీని ఎన్నుకుని బాధ్యతలు అప్పగించారు.

నూతన కార్యవర్గం

ఉపాధ్యక్షులుగా బానోతు బాలు, బుర్ర యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా తప్పెట్ల ఉపేందర్, కార్యదర్శిగా గుగులోతు రాము, కోశాధికారిగా గంధం భద్రయ్య ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా భూక్య కిషన్, బోర మల్లయ్య, గౌరవ సలహాదారులుగా ఎస్.కె. హబీబ్ ఉద్దీన్, సింగబోయిన నరసింహలను ఎన్నుకున్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతగిరి వెంకన్న మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న డీలర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. డీలర్ల సమస్యలను



సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతో పాటు, అవసరమైతే సంఘం తరఫున సమష్టిగా పోరాడుతామని చెప్పారు.డీలర్ల ఐక్యతే సంఘానికి బలమని, ప్రతి సభ్యుడి సమస్యను తన సమస్యగా భావించి ముందుకు సాగుతానని వెంకన్న తెలిపారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో డీలర్ల సంక్షేమం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పలువురు డీలర్లు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో మరిపెడ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## రుద్రంగిలో ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు ప్రారంభం

**రుద్రంగి సెప్టెంబర్ 2 (దేశ టైమ్స్)**



రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) మండల స్థాయి క్రీడా ఎంపికలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. మండల విద్యాధికారి రామకృష్ణ, ఎస్సై మోతిరామ్, సర్పంచ్ గండి నారాయణ, ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, వార్డు సభ్యులు పూదరి మహిపాల్, తుమ్మనపల్లి నరేందర్, ఎర్రం అరవింద్, అంబటి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో సీనియర్, జూనియర్ బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తున్నారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు.

## ఘనంగా వైయస్ఆర్ వర్ధంతి

**వలిగొండ, సెప్టెంబర్ 02 (దేశ టైమ్స్):**



మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 17 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం వెంకట పాపి రెడ్డి, మార్కెట్ చైర్మన్ భీమా నాయక్, పిఎసిఎస్ చైర్మన్ గరిసే రవి, పాశం సత్తిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు బత్తిని సహదేవ్, పోలేపాక జానకి రాములు, కాసుల వెంకన్న, బత్తిని లింగయ్య, పబ్బు సురేందర్, జంగారెడ్డి, చెరుకు శివయ్య, ఖుర్షద్, బత్తిని వరుణ్, ఎమ్మే లింగస్వామి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలలో ఎమ్మెల్యే.



**(యాదాద్రి కరెస్పాండెంట్ )దేశ టైమ్స్,సెప్టెంబర్ 2**

మల్లేపల్లి గ్రామంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు శంకుస్థాపన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు రూ. 40 లక్షల నిధులతో నిర్మించిన డ్రైనేజీ, రూ.10 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు లను ప్రారంభించారు. రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న మహిళా శక్తి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. అనంతరం నాగారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బెలిదే నాగేశ్వర్ నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంభం వెంకటపాపి రెడ్డి, పిఎస్ ఎస్ చైర్మన్ గరిసే రవి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బత్తిని సహదేవ్ గౌడ్, ఉప సర్పంచ్ మలుగ మాధవివెంకటేష్, మహిళా సంఘం సభ్యులు ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17 వ వర్ధంతి వేడుకలు .

**(యాదాద్రి కరస్పాండెంట్) దేశటైమ్స్, సెప్టెంబర్02.**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వలిగొండ పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బండ వర్గాల ప్రజల శ్రేయసే లక్ష్యంగా పనిచేసిన ఏకైక గొప్ప మహనీయ వ్యక్తి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్,పట్టణ పోలేపాక జానకి రాములు, కాసుల వెంకన్న గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


**Telangana Council of Higher Education**
(A Statutory Body of the Government of Telangana)
Opp: Mahavir Hospital, Mahavir Marg, Masabtank, Hyderabad- 500028.

**RAGGING IS AN OFFENCE AS PER LAW**
Act. 26 of 1997

"Ragging in any form is punishable offence under law."
"Ragging is not permissible in campus, not even for fun."

SAY NO TO RAGGING









YES TO JOYFUL CAMPUS



**WHAT IS RAGGING ?**
- Verbal / Physical/Mental/Sexual abuse
- Financial exploitation/extortion
- Indecent behavior
- Undermining human dignity
- Wrongful restraint
- Criminal Intimidation
- Use of force

**PUNISHMENT FOR RAGGING**
- Withdrawal of scholarship
- Debar from examinations
- Expulsion from the institution
- FIR filing at local police station
- Prosecution for crime
- Denial of admission to any other institution




विश्वविद्यालय अनुदान आयोग
University Grants Commission
Quality higher education for all

अखिल भारतीय तकनीकी शिक्षा परिषद्
All India Council for Technical Education

In view of the directions of the **Hon'ble Supreme Court in SLP No. 24295 of 2006 dated 16-05-2007 and in Civil Appeal number 887 of 2009, dated 08-05-2009** and the **All India Council for Technical Education(AICTE)** and **UGC** brings forth these Regulations to prohibit, prevent and eliminate the scourge of ragging including any conduct by any student or students whether by words spoken or written or by an act which has the effect of teasing, treating or handling with rudeness a fresher or any other student or asking any student to do any Act.

| | |
|---|---|
| Teasing , Embarrassing & Humiliation | Imprisonment upto 6 months + fine upto Rs.1,000/- |
| Assaulting or using criminal force or criminal intimidation | Imprisonment upto 1 year +fine upto Rs.2,000/- |
| Wrongfully restraining or confining or causing hurt | Imprisonment upto 2 years + fine upto Rs.5,000/- |
| Causing grievous hurt , kidnapping or rape or committing unnatural offence | Imprisonment upto 5 years + fine upto Rs.10,000/- |
| Causing death or abetting suicide | Imprisonment upto 10 years + fine upto Rs.50,000/- |

For any further clarification access: www.tgche.ac.in

Sd/-
SECRETARY


Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280